# ★ అనాథపిల్లవాడు ★

కథకుడు:—ఎ. సూర్యనారాయణ.

ఆ నెల డిశెంబరు. సాయంకాలమున అతడు ఇంటినుండి బజారుకొచ్చాడు. ఆ సమయమున దాదాపు 8 గంటల పొద్దు పోయింది. పగలంతా వర్షము కురుయుట వలన ఆరాత్రి రోజుకన్న చలి ఎక్కువాయెను. బాగుగా చలివీచుచుండెను. శరీరమంతా చలివలన వణకుచుంది. బజారులన్నియు బురదతో నిండియున్నాయి. ఆ సమయమున రెండుమూడు గంటల తడవు అతడు బిచ్చానికి తిరిగాడు. కాని ఎవరు ఏమి ఇచ్చువారు లేకపొయ్యారు. జనులందరు పొద్దుపోవుట వలన తమతమ ఇండ్లకు పోసాగారు. దుకాణములన్నియూ మూసివేయబడ్డాయి. కాని ఒకచోటుమాత్రం రెండు మూడు దుకాణములు తెరిచియున్నాయి. అక్కడే అయిదారుగురు మనుష్యులు గూడా వున్నట్లు జాడకనుపిస్తూంది. పాపం అక్కడే రోజూ నాలుగు డబ్బులు దొఱుకుతున్నాయి. కాని ఆరోజు ఎలాంటిదో! వారూ ఏమీ ఇవ్వలేదు. పైగా దంచటానికి సిద్ధమైయారు.

ఆతని వయస్సు దాదాపు 8 సంవత్సరాలున్నాయి. కాని ఆ ఆకారము ఆ దీనపు మాటలు చూచిన 6 సంవత్సరముల పిల్లవాడనుకుంటారు. పైగా ఆ ఆకారమునకు ఓడు చిరిగిన పాతగుడ్డొకటి తగిలించికొన్నాడు.

తల్లి లేని ఆనాథబాలుడు. తండ్రి మాత్రం వున్నాడు. అతని తండ్రి అనుభవముగల బిచ్చగాడు. బిచ్చమేయవస్థలో దొఱకునో యతనికి బాగుగా తెలుసు. ఆకలిచే చిరిగిన గుడ్డలతో దీనముతో వున్న పిల్లగానికి బిచ్చము దొఱికిన బాగా నాగలి దుంపలాగా దిట్టముగానున్న తండ్రికి దొరకుట అసంభవమని కూడా అతనికి తెలుసు. ఈ కారణమున తాను బిచ్చమునకు పోకుండా అనాథుడగు తనపిల్లవానిని పంపసాగాడు. వ్యర్థంగా దుకాణముచుట్టూ బజారులచుట్టూ తిరుగునేమో యని భయముచేత పైగా పాపం పొట్టనిండా కూడుగూడా పెట్టేవాడు గాదు. ఆకలిచేనున్న ప్రతివానిని ప్రతి దుకాణమునకు పోయి తప్పనిసరిగా బిచ్చమడుగుతాడని అతనికి బాగుగా నమ్మకం. పొట్ట నిండా కూడు, చలికి మంచి గుడ్డలు నిచ్చిన దీనత్వం కనుపించదను భయముచే ఎప్పుడూ చిరిగిన గుడ్డలతో బిచ్చానికి పంపేవాడు. చిరిగిన గుడ్డలతో దీనముతో నుండిన ప్రతివాడు ధర్మము చేయటానికి సంకోచించరని అప్పుడప్పుడూ తన పిల్లవానికి చెబుతూ వుండేవాడు. న్యాయంగా ఇప్పుడు స్థితి గూడా అలాగేవుంది. ఆకలి, చలి వోర్చుకొనుచూ పిల్లవాడు బజారునకు పోయి మనుష్యులవెంటే తండ్రి చెప్పినలాగా "తల్లిలేని పిల్లవాడు, దిక్కులేని ఆనాథ పిల్లవాడు" అనుచూ రోజూ బజారుచుట్టూ బిచ్చానికి తిరిగేవాడు, న్యాయంగా రోజూ కాస్తో కూస్తో దొరుకుతుంది కూడా.

ఆరోజో పాపం తిరిగి తిరిగీ ఆకలిచే నలసిపొయ్యాడు. చలి ఎక్కువగుటవలన యింటికి పోవాలని బుద్ధిపుట్టింది. కాని వొట్టి చేతులతో వచ్చావని తండ్రి కొట్టునేమో యని భయము కూడావుంది. ఈ భయంచే అనాథునకు ఇంటికి బోవటానికి ధైర్యము లేకపోయింది. కాని వెళ్ళక తప్పిందికాదు. ఒకవైపు చలి అమితంగా వేస్తుంది. ఒక వైపున ఆనాలుగు దుకాణములు కూడా మూసివేయబడుచున్నాయి. ఆసమయయాన అతనిపని "ముందు నుయ్యి వెనుక గొయ్యి" లాగయింది. దెబ్బలకైనా నోర్చుకొని ఏదోకవిధంగా ఇంటికి చేరాలనుకున్నాడు. అక్కడనుండి ఒక చీకటిచోటుకుబొయ్యాడు. అక్కడ ఒక కొయ్యలగుట్ట మండుతూంది. దానికి వెనుకప్రక్కనున్న చిన్న కుటీమే అతని యిల్లు. కుటీరం దగ్గరకు వెళ్ళి కొంచెం సేపక్కడ నిలబడ్డాడు. ఆసమయమున అతని తండ్రి ఇంటిలో చిలము త్రాగుచున్నాడు. కొంచెము సేపటివరకు ఇంటిలో చప్పుడినిపించినది. మరల భయంతో ఇంటిదగ్గరకుబోయి కిటికీగుండా నెమ్మదిగా త్రొంగిచూసాడు. దీపంకాంతి ఇల్లంత వ్యాపించుంది. దీపం దగ్గరనే బిచ్చమునకు బోవటకు అతని తండ్రి విడిపించిన అతని చొక్కా పడివుంది. బైటవీచుచున్న చలిగాలి ఓర్చుకోలేకపొయ్యాడు. ఏదోకవిధంగా ఇంటిలో దూరబడి చొక్కా తీసుకోవలనుకున్నాడు. లోనికి పోవటానికి సిద్ధమైయాడు గూడా. ఇంతలో 4, 5 సార్లు తండ్రి దగ్గుట వినిపించింది. కుఱ్ఱవానిమనస్సు నీరై పోయింది. లోనికిబోవుటానికి సాహసము లేకపోయింది. బైటే నిలబడిపోయాడు. ఈలోగా ఇవ్వాళ పైసా ఏమిదొఱకలేదన్న సంగతి జ్ఞాపకమొచ్చింది. ఈసంగతి జ్ఞప్తికి రాగానే దొంగతనమునకొచ్చి చప్పిడిని పారిపోయే దొంగలాగా, చలి, అర్ధరాత్రి యనే భయంలేకుండా వెర్రిధైర్యంతో పారిపొయ్యాడు.

మొదట తాను రెండుమూడు గంటల సమయం గడిపినచోటుకు మరల చేరాడు. దుకాణములన్నీ మూసివేసి యున్నాయి. పట్టణమంతా నిశ్శబ్దతా వ్యాపించింది. అక్కడక్కడ మ్యునిసిపల్ లైట్లు మాత్రం వెలుగుచున్నాయి. రోడ్ల గుంటలలోని వాననీరు లైటుకాంతికి తళతళ మెఱయుచున్నాయి. ప్రపంచమంతా తమతమ కిటికీలు మూచి సుఖనిద్రపోతుంది. కాని ఆ అనాథపిల్లవాడు పండుకోటానికి చోటు వెతకవలసివస్తూంది.

---


## కథాంజలి ఏజంట్లకు

ప్రతి నెల మీకు కావలసిన ప్రతుల ఖరీదును మీ కమీషను మినహాయించుకొని ప్రతి 20-వ తేది లోపల సొమ్ము పంపవలెను. లేనిచో ప్రతులు దొరకవు.

మేనేజరు :
"కథాంజలి."